సాక్షి
ప్రకాశం
గురువారం । 23 । మార్చి । 2023



పవిత్ర మాసం రంజాన్

ముస్లింలకు అతి పవిత్రమైన రంజాన్ మాసం రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఉపవాస దీక్షలకు ముస్లింలు సమాయత్తమవుతున్నారు.

- 8లో..



ములాయం సింగ్ విగ్రహావిష్కరణ

ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ విగ్రహాన్ని చీరాలలో రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు ఆవిష్కరించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా వసంత నవరాత్రులు ప్రారంభం



బాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో దేవి శరన్నవరాత్రులతో పాటు వసంత నవరాత్రులు ఏటా నిర్వహిస్తారు. శ్రీరామ నవమి వెళ్లిన దశమి వరకు ఈ ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేకపూజలలో భాగంగా అమ్మవారికి అభిషేకం, కాలపూజ, బాలభోగం, గోపూజ, ఉభయదాతల పూజలు, కుంకుమార్చనలు అర్చకుడు ప్రసాదశర్మ ఆధ్వర్యంలో వేదపండితుడు నాగఫణిశాస్త్రి పండితులు ప్రత్యేక పూజలు భక్తులచే జరిపించారు. ఉదయం పల్లకీ సేవ, పద్మవాహనంపై బాలా త్రిపురసుందరీ అమ్మవారి ఉత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తులకు ప్రత్యేకంగా సేవ సమితిలు ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల వద్ద భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిపించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పీ పద్మజ మల్లికార్జునరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు అన్నమ్మ లింగయ్య, ఆదినాగులు శ్రీను, నాయక్, కోటయ్య, ఏ సుబ్బారావు, సుబ్బారెడ్డి ఉభయదాతలు పాల్గొన్నారు.



బాలాత్రిపురసుందరీదేవి ఆలయ ఉత్సవం

సుస్థిర ఆర్థిక ప్రగతి..



రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది లక్షాధికారులు కావాలన్న ఆలోచనతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఆసరా' పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రెండు దఫాలుగా రుణమాఫీ చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలో రూ.558.84 కోట్లు జమచేయగా మూడో విడత ఈ నెల 25వ తేదీన మరో రూ.279 కోట్లు మహిళల ఖాతాల్లో జమచేయనున్నారు.

- "వైఎస్సార్ ఆసరా" మహిళలకు వరం
- స్వయం శక్తిగా ఎదిగేందుకు ప్రభుత్వ తోడ్పాటు
- ఈ నెల 25న మూడో విడత జిల్లాలో రూ.279.42 కోట్ల నగదు జమ
- రెండు విడతల్లో రూ.558.84 కోట్ల రుణాల మాఫీ
- జిల్లాలో 3,58,732 మంది అక్క చెల్లెమ్మలకు లబ్ధి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మహిళలు స్వశక్తితో...తలెత్తుకొని జీవించేలా తీర్చిదిద్దటమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దూసుకుపోతోంది. మహిళలు స్వయం శక్తిగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయం. ప్రజా సంకల్ప యాత్రలో మహిళలు పడుతున్న కష్టాలను కళ్లారా చూసి చలించిన వైఎస్ జగన్ ఎన్నికల హామీల్లో భాగంగా నవరత్నాలను ప్రకటించారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట కోసం డ్వాక్రా రుణ మాఫీ పథకాన్ని నవరత్నాల్లో చేర్చారు.

నాడు బాబు మోసం.. నేడు జగన్ వరం

2014లో ఎన్నికల ముందు.. డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏ ఒక్కరూ డ్వాక్రా రుణం చెల్లించాల్సిన అవసరం లేదని నమ్మకంగా చెప్పారు. దీంతో మహిళలు ఆ రుణాలు చెల్లించలేదు. ఆ తర్వాత ఆయన అధికారంలోకి రాగానే ఆ హామీని అమలు చేయకుండా మోసం చేశారు. దీంతో మహిళల అప్పు.. వడ్డీతో కలిపి చెల్లించలేనంతగా పెరిగిపోయింది. దీంతో బ్యాంకు అధికారుల వేధింపులకు డ్వాక్రా అక్క చెల్లెమ్మలు పడిన బాధలు, అవమానాలు అంతా...ఇంతా కాదు. ఇళ్లకు బ్యాంకు వాళ్లు వచ్చి ఇళ్లు వేలం వేస్తామని నోటీసులు కూడా అంటించారు. చంద్రబాబు చేసిన నయ వంచన డ్వాక్రా మహిళల పాలిట శాపంగా మారింది. తన పాదయాత్రలో డ్వాక్రా అక్కచెల్లెమ్మల బాధలు కళ్లారా చూసిన వైఎస్ జగన్ 2019 సాధారణ ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పొదుపు సంఘాల వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ 'వైఎస్సార్ ఆసరా' పథకానికి శ్రీకారం చుట్టారు. ఇది తమకు నిజంగా వరం అని రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు విడతల్లో రూ.558.84 కోట్ల రుణ మాఫీ:

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 ఏప్రిల్ 11వ తేదీకి ముందు స్టేట్ లెవల్ బ్యాంకింగ్ కమిటీ ఇచ్చిన రుణాల జాబితా ప్రకారం రుణాలు మాఫీ చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటి వరకూ రెండు విడతల్లో జిల్లాలోని డ్వాక్రా మహిళలకు రూ.558.84 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. ప్రతి విడతలోనూ 3,58,732 మంది మహిళలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది.

ఈ నెల 25న మూడో విడత నగదు జమ:

అనుకున్న ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం కింద ఈ నెల 25వ తేదీన మూడో విడత నగదు జమ కానుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా డ్వాక్రా మహిళల బ్యాంకు అకౌంట్లలో జమ చేయనున్నారు. ప్రకాశం జిల్లాలో మొత్తం 36,709 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి 3,58,732 మంది డ్వాక్రా మహిళలకు రూ. 279.42 కోట్లు జమ కానున్నాయి.



డ్వాక్రా గ్రూపు సభ్యురాలికి ఆసరా నగదు వివరాలు వెల్లడిస్తున్న మెప్మా సీసీ

26వ తేదీ నుంచి ఆసరా సంబరాలు

ఈ నెల 26వ తేదీ నుంచి మారుమూల గ్రామం మొదలుకొని మండల కేంద్రం, పట్టణం, నగరం వరకు వాడవాడలా ఆసరా సంబరాలు జరగనున్నాయి. డ్వాక్రా అక్కచెల్లెమ్మల ముఖాల్లో ఆనందం చూడటానికే ఈ వైఎస్సార్ ఆసరా సంబరాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. అందులో భాగంగా వైఎస్సార్ ఆసరాకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉంచారు. మార్చి 14 నుంచి 24వ తేదీ వరకు సిబ్బంది సభ్యుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఈ నెల 25న డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా సీఎం వైఎస్ జగన్ నగదు జమ చేయనున్నారు. ఆ తర్వాత సంబరాలు నిర్వహించనున్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దటానికే



మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదద్దటానికి ఈ వైఎస్సార్ ఆసరా ఎంతగానో ఉపయోగపడుతుంది. డ్వాక్రా రుణాల మాఫీ వలన వచ్చే నగదును వృథా చేయకుండా చిరు వ్యాపారాలు చేసుకునేలా తీర్చిదిద్దుతున్నాం. పాడి పరిశ్రమతో పాటు చిరు వ్యాపారాలు చేసుకొని జీవన ప్రమాణాలను పెంపొందించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– బి.బాబూరావు, పీడీ, డీఆర్‌డీఏ

జీవనోపాధి మెరుగుకు కృషి



డ్వాక్రా గ్రూపు మహిళల జీవనోపాధిని మెరుగుపరిచేలా ప్రోత్సహిస్తున్నాం. వైఎస్సార్ ఆసరా పథకంలో వచ్చే నగదును స్వయం ఉపాధి పొందేలా రూపుదిద్దుతున్నాం. వ్యాపార మార్గాలు చూపించి ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలతో సుస్థిరమైన ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రణాళికలు రూపొందించారు.

– తేళ్ల రవికుమార్, పీడీ, మెప్మా



డ్వాక్రా సభ్యులకు ఆసరా నగదు సద్వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

డీఆర్‌డీఏ పరిధిలోని డ్వాక్రా గ్రూపులు, వాటి వివరాలు:

అసెంబ్లీ నియోజకవర్గం	గ్రూపుల సంఖ్య	సభ్యులు సంఖ్య	మూడో విడత వాయిదా (రూ.కోట్లలో)
దర్శి	4,347	42,946	32.54
గిద్దలూరు	4,661	45,730	30.34
కనిగిరి	3,710	36,796	27.11
కొండపి	6,044	59,100	50.06
మార్కాపురం	3,326	32,905	24.94
ఒంగోలు	1,785	17,566	14.57
ఎస్ ఎన్ పాడు	4,613	45,367	40.38
వై పాలెం	2,791	27,354	14.29
మొత్తం	31,277	30,7764	234.23

మెప్మాకు సంబంధించిన డ్వాక్రా గ్రూపులు, వాటి వివరాలు:

పట్టణం/ నగరం	గ్రూపుల సంఖ్య	సభ్యుల సంఖ్య	మూడో విడత వాయిదా (రూ.కోట్లలో)
గిద్దలూరు	623	5,452	4.85
కనిగిరి	516	4,951	4.49
మార్కాపురం	1,052	9,305	7.98
ఒంగోలు	2,848	2,7581	24.23
చీమకుర్తి	393	3,679	3.64
మొత్తం	5432	50,968	45.19

తెలుగు సంస్కృతిని కాపాడుకుందాం

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు టౌన్: తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఒంగోలులోని పోలీస్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన శోభకృత్ నామ ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంచాంగంలో చెప్పినట్లు నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలంతా పాడిపంటలతో, సిరిసంపదలతో, సుఖశాంతులతో గడపాలని ఆకాంక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పండితులు చెబుతున్న నేపథ్యంలో ఈ ఏడాదే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందుతాయని భావిస్తున్నానని చెప్పారు. తెలుగు ప్రజలు ప్రపంచంలో ఎక్కడున్నా భాష, సంస్కృతిని చాటి చెబుతూ జరుపుకునే ఏకైక పండుగ ఉగాది పర్వదినమని రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ రావు అన్నారు. ఈ ఏడాది ప్రజలకు అంతా మంచే జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి సుబ్బాయమ్మ చెప్పారు. అన్నీ రంగాల్లో జిల్లా అభివృద్ధి చెందుతుందని ఆమె ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అనేక మంది కవులు, రచయితలు ఉన్నందున తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కవి సమ్మేళనం, అష్టావధానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో వీటికి ప్రాధాన్యత ఇచ్చేలా ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, బాపట్ల కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ అభిషిక్త్ కిషోర్ లు కుటుంబ సభ్యులతో పాల్గొనడం విశేషం. తొలుత పూజా కార్యక్రమాలు, జ్యోతి ప్రజ్వలనం అనంతరం మఠంపల్లి దక్షిణామూర్తి పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉంటారని చెప్పారు.

ఆకట్టుకున్న భువన విజయం:

విజయనగర వైభవాన్ని తెలియజేసేలా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం నాటిక ఆకట్టుకుంది. కవి సమ్మేళనం ఆద్యంతం ప్రశంసలు పొందింది. మానేపల్లి నాగకుమార్ శర్మ అష్టావధానం అబ్బురపరచింది. ఈ సందర్భంగా పలువురు అర్చకులను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో సూర్య బలిజ కార్పొరేషన్ డైరక్టర్ దాసరి కరుణాకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, రాష్ట్ర టైలర్స్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్‌పర్సన్ షేక్ సుభాన్ బీ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, దేవదాయ శాఖ సమాయ కమిషనర్ మాధవి, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



వేద పండితులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్ దంపతులు, వేదపండితుడు మఠంపల్లి దక్షిణామూర్తి



కలెక్టర్ దినేష్‌కుమార్, బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ దంపతులకు ఉగాది పచ్చడి పంచుతున్న వేదపండితులు



వేడుకలో కవులను సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ దంపతులు, జూపూడి ప్రభాకర్, జేసీ అభిషిక్త్ కిషోర్



భువన విజయం పౌరాణిక నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వైభవంగా జాళ్లపాలెం తిరునాళ్ల

- మొక్కులు తీర్చుకున్న వేలాది మంది భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యుత్ ప్రభలు

జాళ్లపాలెం (కొండపి): మండలంలోని జాళ్లపాలెం గ్రామంలో శోభకృత్‌నామ ఉగాది పండుగను పురస్కరించుకుని వీరబ్రహేంద్రస్వామి తిరునాళ్లను బుధవారం దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు పొంగళ్లు పెట్టుకుని దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి నైవేద్యం సమర్పించుకున్నారు. కోర్కెలు తీరిన కొందరు భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించుకుని స్నానాలాచరించి గుడి ముందు హోమ గుండంలో ఎండు కొబ్బరి గిన్నెలు వేసి మొక్కు తీర్చుకున్నారు. తిరునాళ్ల రోజు ఉదయం పూట భక్తులు తమ వాహనాలను, పశువులను దేవస్థానం చుట్టూ తిప్పుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పలువురు దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. పలువురు మంచినీరు, మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తుల దాహం తీర్చారు. తిరునాళ్ల సందర్భంగా ఆరు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు.



మఠంలో అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామివారి మూలవిరాట్



దర్శనం కోసం మఠం ముందు కిక్కిరిసిన భక్తులు



భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం

ఉగాది వేడుకల్లో ఎస్పీ దంపతులు

ఒంగోలు టౌన్: శోభకృత్ నామ సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో వేంచేసి ఉన్న సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో బుధవారం సీతారాముల స్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎస్పీ తండ్రి, రిటైర్డ్ డీజీపీ సత్యేంద్ర గర్గ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పంచాంగావిష్కరణ చేసి భక్తులకు పంపిణీ చేశారు. జిల్లా ప్రజలు, పోలీసు అధికారులకు, సిబ్బందికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగు ప్రజలకు అన్ని విధాలా మేలు కలుగజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు యం.రమణ దీక్షితులు, యం.దక్షిణామూర్తి, సీతారామచంద్ర స్వామి భక్తజన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ఉగాది పంచాంగ శ్రవణంలో ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్ దంపతులు

సత్వరం వెలిగొండ ప్రాజెక్టు పూర్తవుతుంది

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: శోభకృతునామ తెలుగు సంవత్సరంలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తవుతుందని, అందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక శివాలయంలో బుధవారం నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చూసుకుంటూ చక్కటి పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి దేవతలు కూడా సహకరిస్తున్నారని, శోభకృతు నామ సంవత్సరంలో అంతా మంచి జరుగుతుందని పంచాంగం చెబుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఉపయోగపడేలా పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని, తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని అందరూ ఆశీర్వదించాలని ఆయన కోరారు. ముందుగా మంత్రి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రెంటచింతల రామయ్య, ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథం ఆయనను ఆశీర్వదించారు. గౌత ఆంజనేయశర్మ పంచాంగాన్ని చదివి వినిపించారు. తాళ్లపల్లి సత్యనారాయణ మంత్రికి సంప్రదాయ కండువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలగురవయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఐ.వి. సుబ్బారావు, సూరె రమేష్, మొగలి సుబ్బారావు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు పార్టీ మండల అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జబీవుల్లా, సర్పంచ్ అరుణాబాయి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

క్లుప్తంగా

తీరానికి కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నాగులుప్పలపాడు: మండలంలోని కనపర్తి గ్రామ శివారు చిన్నంగారి పట్టపుపాలెం సముద్ర తీర ప్రాంతానికి గుర్తు తెలియని పురుషుని మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుని వయసు 40 ఏళ్లు ఉంటాయని, బ్లూ కలర్ చొక్కా ధరించి ఉన్నాడని ఎస్సై హరిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

దేవాలయాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ఉగాది పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ప్రముఖ దేవాలయాలు, తిరునాళ్ల జరిగే ప్రదేశాలల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే ప్రదేశాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తోపులాటలు, తొక్కిసలాటలు లాంటివి జరగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ప్రసిద్ధ దేవస్థానాల వద్ద వచ్చే భక్తులకు కోసం పార్కింగ్ ఏర్పాటు చేశామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్‌రావు, ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్రరావు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


శంకర్‌సదా

ఉలవపాడు: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చాకిచర్ల పంచాయతీ శ్రీరామపురంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. బీహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన శంకర్ సదా(20) అనే యువకుడు శ్రీనివాస బయోప్లాంట్ నర్సరీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఇనుప రాడ్‌తో టార్పాలిన్ పట్టను పైకి ఎత్తుతున్న సమయంలో విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్ర మాసం రంజాన్

- రేపటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం
- జిల్లాలో ముస్తాబవుతున్న మసీదులు

కనిగిరి రూరల్:

ముస్లింలకు అత్యంత ముఖ్యమైన మాసం రంజాన్. ఈ నెలలో ముస్లింలు ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులలో భక్తిభావం ఉప్పొంగుతుంది. ధార్మిక చింతన, ప్రేమ, సౌభ్రాతృత్వం, దానగుణం, క్రమశిక్షణ, పరోపకారం తదితర నియమాలను ముస్లింలు పాటిస్తారు. రంజాన్ నెలలో అత్యంత నిష్ఠగా జరుపుకునే రోజు షబ్-ఏ-ఖదర్. దీని తర్వాత మూడు రోజులకు రంజాన్ పండుగను చేస్తారు. శుక్రవారం నుంచి రంజాన్(నెల) మాసం ప్రారంభం కానుంది. ఉమ్మడి ప్రకాశంలో అత్యధికంగా ముస్లిం జనాభా ఒంగోలు, కనిగిరి, కందుకూరు, పొదిలి, మార్కాపురం, కంభం, గిద్దలూరు, పర్చూరు తదితర ప్రాంతాల్లో ఉన్నారు. ప్రస్తుత జిల్లాలోని మున్సిపాలిటీల్లో అత్యధికంగా కనిగిరిలో ముస్లింలు ఎక్కువ ఉన్నట్లు నివేదికలున్నాయి. జిల్లాలో సుమారు 230 వరకు మసీదులున్నట్లు సమాచారం. ఈ మేరకు జిల్లాలోని మసీదులన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పలుచోట్ల రంజాన్ మాస ప్రారంభ సూచికంగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా ముస్లింలు అధికంగా ఉండే ఏరియాల్లో తోరణాలు.. ఫెక్సీలతో కళకళలాడుతున్నాయి.

రోజా(ఉపవాస దీక్షలు)

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఎటువంటి ఆహార పానీయలు ముట్టకుండా (కఠోర దీక్ష) ఉపవాసాన్ని పాటిస్తారు. లాలాజలం కూడా మింగరు. అత్యంత నిష్ఠతో ఉపవాసాన్ని (రోజాను) ఆచరిస్తారు. సూర్యోదయానికి ముందు సహార్ అని, సూర్యస్తమయం తర్వత ఇఫ్తార్ అని పిలుస్తారు. రోజా ఉండేవారు సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత మాత్రమే ఏదైనా ఫలాహారాలు తీసుకుంటారు. రోజుకు కనీసం 13 గంటలు ఉమ్మికూడా మింగకుండా కఠోర దీక్షలను ఆచరిస్తారు. రోజా పాటించే వారు మనసును భగవంతుని పై లగ్నం చేసి చెడు ఆలోచనలకు దూరంగా ఉంటారు. సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని మసీదుల్లో, దైవ ధ్యానంలో గడుపుతారు. ఈ దీక్షల వల్ల మానవునిలో భగవంతుని పట్ల భక్తి, నమ్మకం, విశ్వాసం, భగవంతుని దృష్టిలో అందరూ సమానమే అన్న భావం పెంపొందుతుంది.


ఈద్గా వద్ద ప్రార్థనల్లో ముస్లింలు (ఫైల్)

రోజెకి నియ్యత్:

అల్లాహుమ్మా అనూముగదన్ లక ఫగ్ ఫిర్లీ మాఖద్ద మ్‌తు వమా అఖ్ఖర్తు..

(ఉదయం 'సహార్' (ఉపవాసం ప్రారంభించేటప్పుడు) చేసే సమయంలో చేసే దువా)

ఇఫ్తార్‌కి దువా:

అల్లాహుమ్మ లక సుమ్తు వఫిక ఆమన్‌తు వఅలైక తవక్కల్తు అలారిజ్ ఖిక అఫ్తర్తు ఫత ఖిబ్బల్ మిన్నీ..

(సాయంత్రం 'ఇఫ్తార్'(ఉపవాస దీక్ష విరమించే)సమయంలో చేసే దువా..

(రంజాన్ అనేది ఒక మాసం(నెల) పేరు. ఉర్దూలో రంజ్ అనగా దహించేదని. ఆన్ అంటే నెల అని అర్థం. మనమల పాపాలన్ని ఉపవాసాలతో, దానాల్లో దహిస్తాయి. కనుక రంజాన్ అనే పేరు వచ్చింది. ఈ మాసంలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ ఆవిర్భవించింది. రంజాన్ నెలలో ఖురాన్ చదివితే మరింత పుణ్యం లభిస్తుందని మత పెద్దలు చెబుతారు.)

ఏహ్ తే కాఫ్: ఈ మాసంలో 21వ రోజు నుంచి నెల చివరి వరకు (తపోనిష్ఠతో) ఏహ్‌తేకాఫ్ కూర్చుంటారు. ఈ ఏహ్‌తే కాఫ్ పాటించే వారు మసీదులోనే పూర్తి సమయాన్ని గడపుతూ.. ప్రార్థనల్లో దివ్య ఖురాన్ (దైవ గ్రంథాలు) చదువుతూ ఉపవాస దీక్షలో నిమగ్నమవుతారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే మసీదు నుంచి బయటకు అడుగుపెడతారు.

జకాత్: ముస్లింలలో మరీ ముఖ్యమైన సాంప్రదాయం జకాత్. ప్రతి వ్యక్తి తన లాభార్జనలో కొంత మేర నిరుపేదలకు దాన, ధర్మాలు చేయడాన్ని జకాత్‌గా పిలుస్తారు. ప్రతి మనిషి తనలాగే ఉన్నతుడు కావాలని కోరుకోవడం ఈ జకాత్ యొక్క ప్రధానుద్దేశం. జకాత్ నిధితో నిరుపేదలకు వస్తువుల రూపంలో గాని, నగదు రూపంలో గాని దానం చేస్తారు. అయితే దానస్వీకర్తల పేర్లను గోప్యంగా ఉంచడమే దీని ప్రధాన నియమం. రంజాన్ నెలలోనే జకాత్‌ను ఇస్తారు.

ఫిత్రా: రంజాన్‌మాసం చివరిరోజున జరుపుకునే పర్వదినం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్). దేవుని అనుగ్రహం కోసం, కృతజ్ఞతగా నిరుపేదలకు ఫిత్రాను (దానం) ఇస్తారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు కిలోల గోధుమలు లేదా, దానికి సమానమైన ఇతర ఆహార ధాన్యలు లేదా నగదు దానం చేస్తారు. రంజాన్‌ను ప్రతి ముస్లిం లోటులేకుండా సంతోషంగా జరుపుకునేందుకు చేయాల్సిన దాన, ధర్మాలను ఇస్లాం మతం బోధిస్తుంది.

ఇఫ్తార్ ప్రత్యేకత

రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసదీక్షను విరమింప చేసే కార్యక్రమాన్నే ఇఫ్తార్ అంటారు. ఈ ఇఫ్తార్ సమయంలో తీసుకునే ఆహారాన్ని దీక్ష వాసులకు అందించడం కూడా పుణ్యకార్యంగా భావిస్తారు. ఇఫ్తార్ విందులను ముస్లింలే కాకుండా ఇతరులు కూడా రోజా ఆచరించిన వారికి ఇస్తారు.

తరావీహ్ నమాజ్

ముస్లింలు ప్రతిరోజు 5 సార్లు నమాజును (ఉదయం ఫజర్, మద్యాహ్నం జోహర్, సాయంత్రం 5 గంటలకు అసర్, రాత్రి 6.30 గంటలకు మగ్‌రీబ్, రాత్రి 8 గంటలకు ఇషా నమాజ్) చేస్తారు. అయితే రంజాన్ నెలలో ఇషా నమాజ్ తర్వాత, ప్రత్యేకంగా ఎంతో నిష్ఠతో మరో 20 రకాత్‌లు 'తరావీహ్' నమాజ్ చేస్తారు. రంజాన్ మాసంలో తరావీహ్ నమాజ్‌కు అత్యంత ప్రాముఖ్యం ఉంటుంది.

'స్కిల్' కుంభకోణం సూత్రధారి చంద్రబాబే

- 370 రూ. కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లోకెల్లా ఇదే భారీ స్కామ్
- దోషులను కఠినంగా శిక్షించాలన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జీఓలు, నోట్ ఫైల్ తదితర అనుమతులేవీ లేకుండా రూ.370 కోట్లకు పైగా నిధులు దారి మళ్లడం వెనుక నారా చంద్రబాబునాయుడు హస్తం ఉందని ఆధారాలతో సహా బట్టబయలైందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోకెల్లా ఇది భారీ స్కామ్ అని, చంద్రబాబు ప్రోద్బలంతోనే నిధులు కొల్లగొట్టారని ఆరోపించారు. బుధవారం మార్కాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. 'స్కిల్' కుంభకోణంలో చంద్రబాబు ప్రోద్బలంతో అప్పటి మంత్రులు, అధికారులు ఎటువంటి జీఓ, అనుమతులు లేకుండా 370 కోట్ల రూపాయలను షెల్ కంపెనీలకు కేటాయించి తిరిగి చంద్రబాబుకు చేర్చారన్నారు. నోటి మాటతో ఎవరైనా రూ.370 కోట్ల ప్రజా ధనాన్ని విడుదల చేస్తారా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్‌లో రూ.10 లక్షల నిధులు రోడ్లకు కేటాయించాలంటే జీఓ, బడ్జెట్ అలాట్‌మెంట్, క్వాలిటీ చెకింగ్ దగ్గర నుంచి అన్ని రకాల నిబంధనలు పూర్తయితేనే ఫైనల్‌గా బిల్లు వస్తుందన్నారు. ఇలాంటి ప్రొసీజర్స్ ఏమీ లేకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ 370 కోట్ల రూపాయల నిధులను ఎలా విడుదల చేసిందో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయాన్ని శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధారాలతో స్పష్టంగా వివరించారన్నారు. ప్రజలందరూ చంద్రబాబు అవినీతిని గమనించాలని కోరారు. ఈ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని, నిందితులందరిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

24, 25న పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్‌మేళా

ఒంగోలు: స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 24, 25 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన 200 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న ఎంఎన్‌సీ కంపెనీ హెచ్ఎల్ మాండో ఆనంద్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. వాహనాల విడిభాగాలు తయారు చేసే ఈ సంస్థ హ్యుందాయ్, జనరల్ మోటార్స్, ఫోర్డ్, ఫోక్స్‌వ్యాగన్, ఆడి, కియా, సుజుకి తదితర ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలతో వ్యాపార భాగస్వామ్యాన్ని కలిగి ఉంది.

ఎవరెవరు అర్హులంటే:

2020, 2021, 2022లో కనీసం 60 శాతం మార్కులతో పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన వారు, 2001 మే 1వ తేదీ తర్వాత జన్మించిన వారు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులని సదరు సంస్థ స్పష్టం చేసింది. పురుషులైతే డీఎంఈ, డీఏఈ, డీఈఈఈ కోర్సులు, మహిళలైతే డీఎంఈ, డీఏఈ, డీఈఈఈ, డీఈసీఈ, డీఏఈఐ, డీసీఎంఈ కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొంది. అభ్యర్థులు రెజ్యూమ్, ఫొటో, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు వెంట తీసుకెళ్లాలి. రాష్ట్రంలోని ఏ జిల్లా నుంచి అయినా అభ్యర్థులు హాజరుకావచ్చు. హాజరైన వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంవీ రామకృష్ణ, ఆ శాఖ అధికారుల బృందం జాబ్‌మేళాను సమన్వయం చేస్తోంది. వివరాలకు 8870985062, 8985872905ను సంప్రదించవచ్చు. ఎంపికైన వారు చెన్నైలోని మాండో సంస్థలో పనిచేయాల్సి ఉంటుంది.

చీరాలలో ములాయం కాంస్య విగ్రహం


సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు

- చీరాలలో ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

చీరాల రూరల్: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ కాంస్య విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక చిన్నమార్కెట్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌బాబు పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ పాలేటి రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. ములాయం సింగ్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లోని ఒక సామాన్యమైన రైతు కుటుంబంలో జన్మించారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడిన ఆయన మనోహర్ లోహియా ఆలోచనా విధానంలో రాజకీయ రంగంలో ప్రవేశించి ఉత్తర ప్రదేశ్‌కు మూడు సార్లు ముఖ్యమంత్రిగా, కేంద్రంలో రక్షణ శాఖా మంత్రిగా పనిచేశారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు ఆయన చేసిన సేవలు మరులేనివన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా చట్టసభల్లో మహిళలకు నామినేటెడ్ పోస్టులు 50 శాతం అందించారని, ఈ మూడున్నరేళ్ల కాలంలో 4 రాజ్యసభ స్థానాలను బీసీలకు కేటాయించారని, అలానే 14 మంది బీసీలకు ఎమ్మెల్సీలుగా అవకాశాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ములాయంసింగ్ యాదవ్‌కు భారతరత్న ఇవ్వాలని రాజ్యసభలో ప్రపోజల్ పెడతానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చీరాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చిమటా సాంబు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ యాదవ్, బీసీ సంఘం జాతీయ నాయకుడు వాకా వెంగళరావు, తాళ్ల వెంకటేశ్వర్లు, నాయిబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ నరసింహరావు, కృష్ణారావు, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు, దేవరపల్లి బాబురావు, గవిని శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ములాయం సింగ్ యాదవ్ కాంస్య విగ్రహం

మిర్చి రైతు పంట పండింది


మిర్చిని బ్యాగ్‌లకు నింపుతున్న కూలీలు

కొత్తపట్నం: దిగజారిన పచ్చిమిర్చి ధర రెట్టింపైంది. తీర ప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, రాజుపాలెం, మోటుమాల, పాదర్తి, మడనూరు, ఈతముక్కల, రంగాయపాలెం గ్రామాల్లో ఎక్కువగా పచ్చి మిర్చి సాగు చేస్తున్నారు. జనవరిలో కోతలు మొదలైనప్పటి నుంచి ధర అనుకూలంగా లేదు. 50 కేజీ బ్యాగ్ రూ.300 నుంచి రూ.400 ఉండేది. కనీసం బ్యాగ్ మిర్చి కోయాలంటే కూలీ రూ.250 ఇచ్చే వాళ్లు. ఇప్పుడు 50 కేజీ బ్యాగ్ రూ.1,100 నుంచి రూ.1,200 దాకా కొనుగోలు చేస్తున్నారు. ఇదే ధర రెండు నెలల పాటు ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. ధర పెరగడం వలన మార్కెట్‌లో డిమాండ్ పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. పెట్టిన పెట్టుబడులు పోను లాభాలు కళ్లజూస్తున్నామని రైతులు సంతోషంగా చెబుతున్నారు.